# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-06-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు.**

**2. గుంటూరులో ఈరోజు జరిగే మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**

**3. ప్రజాస్వామ్యంలో అత్యవసర పరిస్థితి చీకటి అధ్యాయమని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.**

**4. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

**5. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు డి.పురందేశ్వరితో కలిసి ఈరోజు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 26 సెకన్లు

అనంతరం ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఈ అఖండ గోదావరి ప్రాజెక్టు ద్వారా పర్యాటక రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

..వాయిస్.. 30 సెకన్లు

-------------------------

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని ఈరోజుపాటిస్తున్నారు. ప్రతిఏటా జూన్ 26 వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేకదినం పాటించాలని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధిసభ ఇచ్చిన పిలుపుమేరకు ఈ కార్యక్రమం జరుగుతోంది. 1987 డిసెంబర్ 7వ

తేదీన ఐక్యరాజ్యసమితి ఈమేరకు ఒక తీర్మానం ఆమోదించింది. మాదకద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు ప్రత్యేకించి యువతకు తెలియజేయడమే ఈకార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు అంతరిక్ష విధానంపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో అంతరిక్ష రంగంలో పెట్టుబడులపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం ఈ మధ్యాహ్నం గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మిర్చి దాబా వరకు చేపట్టే అంతర్జాతీయ గంజాయి, మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

దేశంలో అత్యవసర పరిస్థితిని విధించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆ కాలంలో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలు పునరావృతం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నంలో అత్యవసర పరిస్థితి' పై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ఈరోజు ప్రారంభించారు. ప్రజాస్వామ్యంలో అత్యవసర పరిస్థితి చీకటి అధ్యాయమని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..35 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బ్యాంకర్లతో ఆయన నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో ఇళ్లు పంపిణీ చేయకుండా రుణాలు ఇచ్చిన వాటికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. బ్యాంకులకు బకాయిలు చెల్లించడంతో కొత్త రుణాలు, వాయిదా నిధులు విడుదల చేయాలని మంత్రి నారాయణ బ్యాంకుల అధికారులను కోరారు.

---------------------------

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ-ఏపీఎస్పిడిసిఎల్ ఇన్చార్జ్ రెడ్డెప్ప అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం అందించే రాయితీతో సౌరఫలకాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ను ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

---------------------------

పాస్పోర్ట్ సేవలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గానూ ఉత్తమ పాస్ పోర్ట్ అధికారిగా విజయవాడ పాస్పోర్ట్ కార్యాలయ అధికారి కె. శివ హర్ష కేంద్ర విదేశాంగశాఖ పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలో పాస్ పోర్టు సేవాదినోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రధానం చేశారు. అలాగే పాస్పోర్ట్ ధృవీకరణ సేవలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గానూ ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖ, గుంటూరు పోస్టాఫీస్ పాస్పోర్ట్ సేవా కేంద్రం "అత్యుత్తమ సేవా కేంద్రం"గా ప్రత్యేక పురస్కారాలను అందుకున్నాయి.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష డీఈఈసెట్ ఫలితాలు, ర్యాంకు కార్డులు ఈరోజు విడుదలైయ్యాయి. ఈ ఫలితాలను పాఠశాల విద్యా సంచాలకులు కె విజయరామరాజు విడుదల చేశారు. పాఠశాల విద్యా వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాగా డీఈఈసెట్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను ఈ నెల 2వ తేదీన నిర్వహించారు.

---------------------------

ఉపాధ్యయ పరీక్షలకు సంబంధించి నిర్వహించిన డీఎస్సీ ప్రాథమిక ‘కీ’ని ఈరోజు విడుదల చేసినట్లు కన్వీనర్ వెంకటకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య, ఫిజికల్ డైరెక్టర్, పీజీటీ జీవశాస్త్రం పరీక్షలకు సంబంధించిన ఫలితాలు డీఎస్సీ వెబ్‌సైట్‌లో, అభ్యర్థుల లాగిన్‌లో రెస్పాన్స్ షీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఆన్‌లైన్‌లో జులై 2లోపు పంపించాలని సూచించారు.

---------------------------

ఒరిస్సా రాష్ట్రంలోని పూరీలో నిర్వహించనున్న శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్రకు శ్రీకాకుళం మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రేపు జగదల్‌పూర్ నుంచి పూరీ వరకు వెళ్లే రైలు విజయనగరం, శ్రీకాకుళం రోడ్ మీదుగా వెళ్తుందని తెలిపారు. తిరిగి 28వ తేదీన తిరుగు ప్రయాణంలో పూరీ నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు శ్రీకాకుళం మీదుగా ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ రైళ్ళు కోటబొమ్మాళి, పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్‌లలో ఆగుతాయని వివరించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్…27 సెకన్లు

=====================